

కన్నీళ్లే మిగిలాయి

ఇసుకగుంతలో చిక్కుకుని ఎడ్లబండి యజమాని మృతిచెందాడు. ఈ ఘటన గూడలి వద్ద చోటుచేసుకుంది. - 8లో



దివ్యానుగ్రహ హోమం..

అలిపిరి సమీపంలోని సప్త గోప్రదక్షిణ మందిరంలో శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం వైభవంగా ప్రారంభమైంది. - 8లో



ఫుట్‌బాల్ విజేత..

విక్రమ సింహపురి యూనివర్సిటీ అంతర్ కళాశాలల క్రీడాపోటీలలో ఫుట్‌బాల్ విజేతగా శ్రీకృష్ణచైతన్య డిగ్రీ కళాశాల నిలిచింది. - 8లో

అరణ్య రోదన!



ఆక్రమిత భూమిలో కర్రలే విద్యుత్ స్తంభాలు

చెరువులు, గుట్టలే కాదు.. ఏకంగా అడవినే ఆక్రమించేశారు. చెట్టూపుట్టా కొట్టి చదును చేశారు. ఆపై ఎవరికీ అనుమానం రాకుండా నిమ్మ సాగుకు శ్రీకారం చుట్టారు. సాగునీటి కోసం ఎలాంటి అనుమతులు లేకుండానే అటవీశాఖ భూముల్లో బోర్లు సైతం డ్రిల్ చేశారు. ఆపై మోటార్లు అమర్చి నిబంధనలకు విరుద్ధంగా కరెంట్ తీగలు లాగారు. వీటికి అనుమతులు లేకపోవడంతో కర్రలనే స్తంభాలుగా మార్చేశారు. అధికారుల కళ్లుగప్పి యథేచ్ఛగా సాగుచేస్తున్నారు. ఈ ఘటన ఎక్కడో కాదండోయ్.. వెంకటగిరి మండలం, బసవాయిగుంట పరిధిలో..ఇక్కడ ఉన్న ప్రభుత్వ, అటవీ భూములను తమ్ముళ్ల కబ్జా చేసి సాగు చేస్తుండడం గమనార్హం.

బసవాయిగుంటలో.. తమ్ముళ్ల పాగా!

- నాడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని 175 ఎకరాల ఆక్రమణ
- అటవీ అధికారుల చొరవతో 100 ఎకరాలు స్వాధీనం
- మరో 75 ఎకరాల స్వాధీనానికి యత్నం
- అటవీ భూమి ఆన్‌లైన్‌లో ప్రభుత్వ భూమిగా మార్పు
- కి.మీ పైగా అక్రమంగా విద్యుత్ లైన్ ఆపై విద్యుత్ చౌర్యం

సాక్షి, తిరుపతి: నాడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీ నేతలు పెద్ద ఎత్తున భూ ఆక్రమణలకు పాల్పడ్డారు. గూడూరు డివిజన్ పరిధిలో ప్రభుత్వ, అటవీ, కాలువ, చెరువు పోరంబోకు భూములను విచ్చలవిడిగా ఆక్రమించుకున్నారు. అలా ఆక్రమించుకున్న భూములను రెగ్యులరైజ్ చేసుకునేందుకు నేడు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. వెంకటగిరి మండలం, బసవాయిగుంట పరిధిలో అటవీ, ప్రభుత్వ భూములు ఉన్నాయి. వీటిని సొంతం చేసుకునేందుకు నాడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆక్రమణలకు దిగారు. సర్వే నం.74లో వందల ఎకరాల అటవీ భూములు ఉన్నాయి. నాటి ఎమ్మెల్యే, నేటి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అనుచరులు, తన సామాజికవర్గం వారు ఏకమై 175 ఎకరాలు ఆక్రమించారు. అందులో నిమ్మసాగుకు శ్రీకారం చుట్టారు. ఆక్రమణల విషయం అటవీ అధికారులకు తెలియడంతో స్వాధీనానికి ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే టీడీపీ నేతలు అడుగడుగునా అడ్డుపడడం, అటవీ అధికారులపైనే కేసులు పెట్టడం అక్కడ అప్పట్లో చర్చనీయాంశమైంది. అయినా 100 ఎకరాల వరకు స్వాధీనం చేసుకుని ప్లాంటేషన్ చేపట్టారు. మిగిలిన భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. అయితే ఇప్పటికీ టీడీపీ నేతలు అటవీ అధికారులపై ఎదురు కేసులు పెట్టి ముందుకు వెళ్లకుండా అడ్డుకుంటున్నట్లు తెలిసింది. ఇదిలా ఉంటే.. నిబంధనలకు విరుద్ధంగా అటవీ యాక్ట్‌ను తుంగలో తొక్కి జేసీబీలతో చదునుచేసి భూములను ఆక్రమించుకున్నారు. అందులో నిమ్మ సాగు ప్రారంభించారు. సాగు కోసం బోర్లు వేసి అధికారుల అనుమతులు లేకుండా అక్రమంగా విద్యుత్ కనెక్షన్లు ఇచ్చుకున్నారు. అదికూడా కర్రలు నాటి విద్యుత్ వైర్లు ఏర్పాటు చేసుకున్నారు. అయినా ఎవరూ అటువైపు కన్నెత్తి చూడలేదు.

అది అటవీ భూమే

ఆ సర్వే నంబర్‌లో ఉన్న విస్తీర్ణం మొత్తం అటవీ భూమే. ఆ భూమిని కొందరు ఆక్రమించుకున్న మాట వాస్తవమే. అందులో వంద ఎకరాల వరకు స్వాధీనం చేసుకుని ప్లాంటేషన్ చేశాము. మిగిలిన భూమిని స్వాధీనం చేసుకోవాల్సి ఉంది

- రాజేంద్రప్రసాద్, ఫారెస్ట్ రేంజర్, వెంకటగిరి

చర్యలు తప్పవు

ఎఫ్‌ఎల్‌ఆర్ ప్రకారం ఆ భూమి పశువుల మేత పోరంబోకు భూమి అని ఉంది. భూమి వివరణ విషయంలోకి వస్తే అటవీ భూమి. అయితే ఆక్రమణల విషయం మా దృష్టికి రాలేదు. ఆ భూమి ఆక్రమించి ఉంటే విచారించి చర్యలు తీసుకుంటాము.

- పద్మావతి, తహసీల్దార్, వెంకటగిరి

భూమి స్వభావాన్నే మార్చేశారు

చట్ట ప్రకారం అటవీ భూములను ఆక్రమించి, సాగు చేయకూడదు. అందులో బోర్లు, విద్యుత్ వైర్లు ఏర్పాటు చేయకూడదు. ఒక వేళ తెలిసో తెలియకో ఆక్రమించుకుని సాగుచేసుకుంటున్నా.. ఆ భూమి రెగ్యులరైజ్ కాదు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అనుచరులు కింది స్థాయి రెవెన్యూ అధికారులు, ఆపరేటర్ల సహకారంతో అటవీ భూములను ప్రభుత్వ, మేత పోరంబోకు భూమిగా ఆన్‌లైన్‌లో మార్పులు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలాచేస్తే రేపు భూములు రెగ్యులరైజ్ చేసేందుకు అవకాశం దొరుకుతుంది. రెవెన్యూ అడంగల్ రికార్డు ప్రకారం అటవీ భూమి అని ఉంది. రీసర్వే తరువాత ఎఫ్‌ఎల్‌ఆర్ ప్రకారం పశువుల మేత పోరంబోకు భూమి అని ఉంది.



ఆక్రమిత భూమిలో సాగులో ఉన్న నిమ్మతోట

న్యూస్‌రీల్

గుర్తింపుపై హర్షం




సీఎం వైఎస్ జగన్‌తో ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు

తిరుపతి అర్బన్: ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు హోదాను కల్పించడంపై ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చంద్రయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం తాడేపల్లిలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేసినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో 49,500 మంది ఆర్టీసీ ఉద్యోగులు ఉన్నారని చెప్పారు. అయితే ఉద్యోగ సంఘంలో 25శాతం ఉద్యోగులు ఉంటేనే గుర్తింపు హోదా వస్తుందన్నారు. ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌లో 14,233 మంది ఉద్యోగులు ఉన్నారని, తమపై నమ్మకంతో హోదా కల్పించినందుకు ఆ నమ్మకాన్ని నిలపెట్టుకుంటామని ఆయన స్పష్టం చేశారు. కార్మికులుగా ఉన్న తమను ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగులు చేశారని సీఎంను కొనియాడారు. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా వారం రోజుల పాటు సంబరాలు చేస్తామన్నారు. తమ అసోసియేషన్‌కు గుర్తింపు హోదా కల్పించేందుకు కృషి చేసిన గౌరవాధ్యక్షులు, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డికి, రవాణా శాఖా మంత్రి విశ్వరూప్‌కు, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

డిసెంబర్ నుంచి కందిపప్పు, గోధుమ పిండి

తిరుపతి అర్బన్: చౌకదుకాణాల్లో వచ్చే డిసెంబర్ నుంచి కందిపప్పు, గోధుమపిండి పంపిణీ చేయనున్నట్లు సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ వై.సుమతి తెలిపారు. గురువారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లోని చౌకదుకాణాలకు 10 వేల మెట్రిక్ టన్నుల రాగులను సరఫరా చేశారని వెల్లడించారు. రేషన్ డీలర్లు ప్రతి నెలా 20వ తేదీలోపు డీడీలు చెల్లిస్తే, 21వ తేదీ నుంచి నెల చివరికల్లా అన్ని రేషన్ షాపులకు రేషన్ సరుకులను పంపిణీ చేస్తామని చెప్పారు. ఉచితంగా అందిస్తున్న బియ్యం, రాగులను కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నేడు అష్టోత్తర శతకలశాభిషేకం



పెంచలకోన దేవస్థానం

రాపూరు: పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం చిలుక ద్వాదశిని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. మధ్యాహ్నం ఉసిరి, తులసి చెట్లకు ప్రత్యేక పూజలు, కార్తీక వనభోజనాలు ఉంటాయన్నారు.

నేటితో ముగియనున్న వీసీ పదవీ కాలం

తిరుపతి సిటీ : ఎస్వీయూ వీసీ కె.రాజారెడ్డి పదవీకాలం శుక్రవారంతో ముగియనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నియమించిన సెర్చ్ కమిటీ వీసీ అభ్యర్థుల ఎంపికలో నిమగ్నమైంది. పదుల సంఖ్యలో ఆశావాహులు విజయవాడ సీఎంవో కార్యాలయంలో సంప్రదిస్తున్నట్టు సమాచారం. సెర్చ్ కమిటీ పరిశీలనలో ఉండటంతో అంతవరకు నెల్లూరు సింహపురి యూనివర్సిటీ, పద్మావతి మహిళా వర్సిటీ వీసీలను ఇన్‌చార్జిలుగా నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది.

డిగ్రీ కళాశాలలో కొత్త కోర్సు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శంకరశర్మ

సూళ్లూరుపేట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ఫిజిక్స్ ఆనర్స్ విత్ రీసెర్చ్ అనే కొత్త కోర్సును ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకరశర్మ తెలిపారు. కళాశాలలోని కాన్ఫరెన్స్ హాలులో గురువారం కొత్త కోర్సును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి కోర్సుకు రాష్ట్రంలోని మూడు కళాశాలలకు మాత్రమే అనుమతి లభించిందన్నారు. ఈ విద్యా సంవత్సరానికి 10 సీట్లు మాత్రమే కేటాయించినట్లు తెలిపారు. ఫిజిక్స్ విభాగాధిపతి వీ.రాజా మాట్లాడుతూ ఈ కోర్సులో ఉత్తీర్ణులైన తరువాత నేరుగా పీహెచ్‌డీ, ఎంటెక్ కోర్సులు చేయవచ్చని చెప్పారు. విదేశాల్లో ఎంఎస్ చేయవచ్చన్నారు. ఈ డిగ్రీతో ట్రిపుల్ ఐటీ, జూనియర్, రెసిడెన్సియల్, పాలిటెక్నిక్ కళాశాలల్లో అధ్యాపకులుగా ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. సీనియర్ అధ్యాపకులు వరప్రసాద్, ఎస్.శ్రీనివాస్, ఉషారాణి, సుబ్రమణ్యంశాస్త్రి, పీ.ఏడుకొండలు, ఏ.బాబు పాల్గొన్నారు.

26 నుంచి సంకల్ప యాత్ర



డీఎల్‌డీఓతోపాటు పంచాయతీ అధికారులు

తిరుపతి అర్బన్: కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర ఈనెల 26 నుంచి జనవరి 26 నిర్వహించనున్నట్లు కేంద్ర పరిశీలకుడు ప్రకాష్ పిచ్చ్ తెలిపారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లోని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారికి డీపీవో రాజశేఖర్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 60 రోజుల పాటు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర దేశ వ్యాప్తంగా కొనసాగుతుందన్నారు. తిరుపతి జిల్లాలోనూ 60 రోజుల పాటు వికసిత్ భారత్ యాత్ర ఉంటుందన్నారు.

జగనన్న లేకపోతే మాకు జీవితమే లేదు



తిరుపతి 3వ డివిజన్‌లో జెండా ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

- సంక్షేమ పథకాలను గుర్తుచేసుకుని మురిసిపోయిన పేదలు
- తిరుపతిలో అట్టహాసంగా వై ఏపీ నీడ్స్ జగన్
- రూ.1,600 కోట్లతో తిరుపతి అభివృద్ధి
- టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి వెల్లడి



25వ డివిజన్‌లో చేతులెత్తి వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలుపుతున్న స్థానికులు

తిరుపతి మంగళం : రాష్ట్రంలో పేదల అభ్యున్నతే లక్ష్యంగా.. పాలన సాగిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో లేకపోతే తమ లాంటి లక్షలాది మంది పేదలకు జీవితమే లేదని తిరుపతి నగరంలోని 3, 22, 25 డివిజన్ల ప్రజలు తెలిపారు. జగనన్న అధికారంలోకి వచ్చాక తమ జీవితాల్లో మార్పు వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. మళ్లీ జగనన్నే సీఎం కావాలని ఆకాంక్షించారు. తిరుపతి కార్పొరేషన్ పరిధిలోని 3, 22, 25 డివిజన్లలో గురువారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి నిర్వహించారు. ఆయా డివిజన్లలో జగనన్న అందించిన సంక్షేమ పథకాలను ఆయన ప్రజలకు వివరించారు. పార్టీ జెండాను ఎగురవేసి, సంక్షేమ బోర్డులను ఆవిష్కరించారు. అనంతరం జగనే మళ్లీ ఎందుకు కావాలన్న అంశాలను స్థానిక ప్రజలకు వివరించారు. జగనన్నే తిరిగి సీఎంగా కావాలంటూ అందరూ చేతులెత్తి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో తిరిగి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుంటే మరింత సంక్షేమం అందిస్తారన్నారు. రూ.1,600 కోట్లతో తిరుపతిని అభివృద్ధి చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఒక తిరుపతి నగరంలోనే 26 వేల మంది పేదలకు సొంతింటి కల నెరవేర్చారని చెప్పారు. పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, దేవదానం, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు దొడ్డారెడ్డి మురళీరెడ్డి, పడమటి కుమార్, కార్పొరేటర్లు సునీత, నరసింహ ఆచ్చారి, జేసీఎస్ అధ్యక్షులు మద్దాలి శేఖర్, ఆర్టీఏ సభ్యులు ఎం.సునీల్‌చక్రవర్తి, టౌన్‌బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుయాదవ్, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్లు మబ్బు నాధమునిరెడ్డి, మాకం చంద్రయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కల్యాణమస్తు ఓ వరం

- అట్టహాసంగా వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా కార్యక్రమం
- జిల్లాలో నాల్గో విడతలో 535 మందికి మంజూరు
- లబ్ధిదారుల ఖాతాల్లో రూ.4.42 కోట్లు జమ



లబ్ధిదారులకు మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పేదోడికి ఓ వరమని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. గురువారం తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా జిల్లా కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా తాడేపల్లి నుంచి ఈ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించగా.. ఆ కార్యక్రమాన్ని వీడియోకాన్ఫరెన్స్ ద్వారా తిరుపతి జిల్లా వాసులు వీక్షించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో కలిసి మెగా చెక్కును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాల్గో విడత ద్వారా జిల్లాలో 535 మందికి రూ.4.42 కోట్లు జమచేసినట్టు తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా ఎంపిక జరుగుతోందన్నారు. ప్రతి త్రైమాసికానికి ఒకసారి లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని, వధూవరులు వివాహమైన 30 రోజుల్లోపు తమ దగ్గర్లోని గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలను ధ్రువీకరించుకుని ప్రతిపాదనల మేరకు ప్రతి ఏటా ఫిబ్రవరి, మే, ఆగస్టు, నవంబర్ నెలల్లో ఆయా త్రైమాసికాలకు సంబంధించిన అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందిస్తారని వివరించారు. జిల్లా పథక సంచాలకులు డీఆర్‌డీఏ జ్యోతి, జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ, సాధికార అధికారి భాస్కర్‌రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి సూర్యనారాయణ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు, డీఆర్డీఏ, మెప్మా సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

హర్షణీయం



మాది పాడిపేట గ్రామం. బీసీ కులానికి చెందినవాళ్లం. మాకు ఈ ఏడాది ఆగస్టు 23వ తేదీన వివాహమైంది. గతంలోనే వైఎస్సార్ కల్యాణమస్తు పథకం ద్వారా రూ.50 వేలు లబ్ధి పొందాం. ఇచ్చిన మాట ప్రకారం ప్రతిపథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేయడం హర్షణీయం.

-ఝూన్సీ దంపతులు, పాడిపేట గ్రామం

జగనన్నకు రుణపడి ఉంటాం




మాది రేణిగుంట మండలంలోని కరకంబాడి పంచాయతీ. కల్యాణ మస్తు పథకం ద్వారా రూ.50 వేలు లబ్ధి పొందాం. ఈ ప్రభుత్వంలో ప్రధానంగా వికలాంగుల ఫింఛన్, వృద్ధాప్య పింఛన్ మా కుటుంబాన్ని ఆదుకుంటున్నాయి. ఆర్థిక ఇబ్బందులు తప్పాయి. పేదోళ్ల అభివృద్ధికి సీఎం జగనన్న ఎంతో చేస్తున్నారు. ఆయనకు రుణపడి ఉంటాం.

-నాగరాజు, దంపతులు, కరకంబాడి

ప్రధాని పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

- 26, 27 తేదీల్లో ప్రధాని తిరుపతి పర్యటన
- కలెక్టర్ వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: ప్రధాని నరేంద్రమోదీ 26, 27వ తేదీల్లో తిరుపతి పర్యటనకు వస్తున్న నేపథ్యంలో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. ఆయన గురువారం కలెక్టరేట్‌లో ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, జేసీ డీకే బాలాజీ, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత, జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, ఆర్డీవోలు, అదనపు ఎస్పీలు, జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని 26వ తేదీ సాయంత్రం 6.55 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని రోడ్డు మార్గాన తిరుమల చేరుకుంటారని తెలిపారు. రాత్రి అక్కడే బస చేసి 27వ తేదీ ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారని తెలిపారు. అనంతరం రేణిగుంట విమానాశ్రయం చేరుకుని ఉదయం 10.25 గంటలకు తిరుగు ప్రయాణమవుతారని చెప్పారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన చోట బారికేడ్లు ఏర్పాటుచేయాలని, రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, గవర్నర్ రానున్నారని వాటికి సంబంధించిన ఏర్పాట్లు చేపట్టాలని చెప్పారు. ఎస్పీ మాట్లాడుతూ రేణిగుంట విమానాశ్రయం నుంచి ప్రధాని పర్యటించే అన్ని ప్రాంతాల్లోనూ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు ఎస్పీలు కులశేఖర్, వెంకటరావు, రాజేంద్ర, ఆర్డీవోలు నిశాంత్ రెడ్డి, కిరణ్ కుమార్, చంద్రముని, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసులు, కోదండరామిరెడ్డి, శ్రీనివాసులు, భవాని, ప్రొటోకాల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ నాయుడు, ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ బసవరాజ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సలహా మేరకే మందుల వినియోగం

తిరుపతి అర్బన్: వైద్యుల సలహా మేరకే మందులు వినియోగించాలి కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం అధికారులతో కలిసి ప్రపంచ యాంటీ మైక్రోబియల్ అవేర్నెస్ వీక్ బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బ్యాక్టీరియా వైరస్‌లు, శిలీంధ్రాలు, పరాన్నజీవులు కాలక్రమేణా మారినప్పుడు వచ్చే వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీహరి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ అరుణ సులోచన, డీపీఎంవో శ్రీనివాసులు, డాక్టర్ తేజ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 5 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 65,891 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 22,896 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపేణా హుండీలో రూ.4.04 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థిని సత్కరిస్తున్న పాఠశాల అధినేత గుడ్లూరు మయూర్

శ్రీకాళహస్తి: జాతీయ స్థాయి లాన్‌టెన్నిస్ పోటీలకు స్థానిక ఎంజీఎం పాఠశాల విద్యార్థి షేక్ అబూబాకర్ సిద్ధిక్ ఎంపికయ్యాడు. 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చాంపియన్‌షిప్ 2023–24 అండర్–17 లాన్‌టెన్నిస్ పోటీలు ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు కాకినాడలో జరిగాయి. ఈ పోటీలో ప్రతిభ చూపిన షేక్ అబూబాకర్ సిద్ధిక్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. గురువారం పట్టణంలోని ఆ పాఠశాల ఆవరణలో విద్యార్థిని ఘనంగా సత్కరించారు. ఎంజీఎం సంస్థల డైరెక్టర్ గుడ్లూరు మయూర్, ప్రిన్సిపాల్ వీఎస్ రత్నం, ప్రధానోపాధ్యాయులు మునిరత్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

లాటరీ నిర్వాహకుల అరెస్ట్

నాయుడుపేట టౌన్: పట్టణంలోని గాంధీ పార్కు సెంటర్ వద్ద సింగిల్ నంబర్ లాటరీ నిర్వహిస్తున్న నలుగురిని గురువారం అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు. గాంధీపార్కు సమీపంలో కొంతమంది సింగిల్ నంబర్ల లాటరీలు జరుపుతున్నట్లు బుధవారం రాత్రి సమాచారం అందింది. దీంతో సీఐ నరసింహరావు సారథ్యంలో ఎస్‌ఐ వేణు సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పట్టణానికి చెందిన భాస్కర్, కార్తీక్, బాబు, సిరాజ్‌ను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించినట్టు పోలీసులు పేర్కొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

- బంగారు, వెండి స్వాధీనం

తిరుపతి క్రైమ్: నగరంలో పట్టపగలే దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసినట్లు క్రైమ్ పోలీసులు గురువారం తెలిపారు. వారి కథనం..కార్వేటినగరానికి చెందిన తుంబుర ఫరూక్(28), తిరుపతి గోపాలరాజు కాలనీకి చెందిన ఆకతి పెంచలయ్య(29) కలిసి కొంతకాలంగా పట్టపగలే తాళం వేసి ఇళ్లను టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడేవారు. ఖచ్చితమైన సమాచారం అందడంతో వీరిని కరకంబాడిలోని అన్నమయ్య మార్గం వద్ద గురువారం మధ్యాహ్నం అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.5,76,000 విలువచేసే 102 గ్రాముల బంగారు, ఒక కేజీ వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా క్రైమ్ ఏఎస్పీ విమల్ కుమారి ఆధ్వర్యంలో డీఎస్పీ రవికుమార్ బృందం ఈ కేసును ఛేదించింది. నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.

వేడుకగా శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం





దివ్యానుగ్రహ హోమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



అలిపిరి వద్దనున్న సప్త గో ప్రదక్షిణ మందిరం వరకు ఊరేగింపు కార్యక్రమంలో అర్చకులు, పండితులు, వేద విద్యార్థులు, కళాకారులు



- టీటీడీలో మరిన్ని భక్తి చైతన్య కార్యక్రమాలు
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి వెల్లడి

తిరుపతి కల్చరల్: లోక కల్యాణార్థం భవిష్యత్‌లో టీటీడీ మరిన్ని భక్తి చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. అలిపిరి సమీపంలోని సప్త గోప్రదక్షిణ మందిరంలో గురువారం శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ మాట్లాడుతూ సనాతన హైందవ సంస్కృతిలో హోమానికి విశేష ప్రాధాన్యత ఉందన్నారు. తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో శ్రీవారి పాదపద్మాల వద్ద ఈ హోమ కార్యక్రమాన్ని శాశ్వతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తుల కోరికలను భగవంతునికి చేర్చే ఒక బృహత్తర కార్యక్రమానికి టీటీడీ నేడు శ్రీకారం చుట్టిందన్నారు. ఎంతో ఖర్చు, శ్రమతో కూడిన ఈ హోమ కార్యక్రమాన్ని భక్తుల కోసం తక్కువ ఖర్చుతో ఎస్వీ వేద వర్సిటీ ఆధ్వర్యంలో రోజూ ఉదయం 9 నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. హోమ వేదిక వద్ద ప్రతి రోజూ వంద మంది గృహస్తులు పాల్గొనేలా ఏర్పాటు చేశామని, ఆన్‌లైన్‌లో డిసెంబర్ 31వ తేదీ వరకు హోమం టిక్కెట్లు బుక్ అయ్యాయని తెలిపారు. భక్తులు వర్చువల్‌గా కూడా ఈ హోమ కార్యక్రమంలో పాల్గొనవచ్చని, దాత సహకారంతో త్వరలో సుమారు 500 మంది గృహస్తులు కూర్చుని ఈ హోమ కార్యక్రమంలో పాల్గొనే వేదికను నిర్మించనున్నట్లు తెలిపారు. భక్తులకు సులభతరంగా శ్రీవారి దర్శనం కల్పించడంతో పాటు, భక్తుల చెంతకు భగవంతున్ని తీసుకెళ్లాలనే సంకల్పంతో టీటీడీ శ్రీనివాస కల్యాణాలు, వైభవోత్సవాలు, శ్రీవేంకటేశ్వర భక్తి చానల్, భజన బృందాల ఏర్పాటు, అన్నమాచార్య సంకీర్తనలు భక్త లోకానికి అందించడం, ఎస్వీ వేద వర్శిటీ స్థాపన వంటి అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు చైర్మన్ వివరించారు. రాష్ట్ర మంత్రి ఆర్‌కే. రోజా మాట్లాడుతూ శ్రీనివాస దివ్యానుగ్రహ విశేష హోమంలో ప్రతిఒక్క భక్తుడూ పాల్గొనేందుకు అవకాశం కల్పించిందని తెలిపారు. రూ.1000 టికెట్‌తో హోమంలో పాల్గొని భక్తులు తమ కోర్కెలను భగవంతునికి విన్నవించే అవకాశం ఈ హోమం ద్వారా దక్కడం శుభపరిణామమన్నారు. అనంతరం టీటీడీ ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రాణిసదాశివమూర్తి ప్రసంగించారు.





హోమంలో మంత్రి ఆర్కే రోజా, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి దంపతులు, ఈవో ఏవీ.ధర్మారెడ్డి, కళాబృందాల ప్రదర్శన

శోభాయమానంగా హోమ ఊరేగింపు

అలిపిరి పాదాల మండపం వద్దనున్న సప్త గో ప్రదక్షిణ మందిరంలో శ్రీనివాస దివ్యానుగ్రహ విశేష హోమం ప్రారంభం సందర్భంగా గురువారం ఉదయం చేపట్టిన ఊరేగింపు శోభాయమానంగా సాగింది. ఎస్వీ వేద విశ్వ విద్యాలయం నుంచి భజన మండళ్ల కళాకారుల భజనలు, సంకీర్తనలు, మంగళ వాయిద్యాల నడుమ ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఊరేగింపు కోలాహలంగా సాగింది. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి, బోర్డు సభ్యులు తిప్పేస్వామి, సుబ్బరాజు, దేశ పాండే, యానాదయ్య, సతీష్‌కుమార్, శేఖర్‌రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి దంపతులు, జేఈఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం దంపతులు, జిల్లా జాయింట్ కలెక్టర్ బాలాజీ, సీవీఎస్‌వో నరసింహ కిషోర్ పాల్గొన్నారు.

క'న్నీళ్లే' మిగిలాయి!

- ఇసుక గుంతలో చిక్కుకుని వ్యక్తి మృతి
- తండ్రి మృతితో తల్లడిల్లిన నలుగురు కుమార్తెలు



కన్నీరుమున్నీరవుతున్న మృతుడు మస్తాన్ కుమార్తెలు

కోట: ఇసుకగుంతలో చిక్కుకుని ఎడ్లబండి యజమాని మృతిచెందిన సంఘటన గురువారం గూడలి వద్ద స్వర్ణముఖినదిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ పుల్లారావు తెలిపిన వివరాల మేరకు.. గూడలి అరుంధతీవాడకు చెందిన పొల్లుల మస్తాన్(40) ఎడ్లబండి ద్వారా ఇసుక తోలుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. రోజూలాగే ఇతర బండ్లతో కలిసి స్వర్ణముఖిలోకి వెళ్లాడు. ఇసుకను నింపుకుని వెలుతున్న క్రమంలో కొందరు జేసీబీతో బండ్లు వెళ్లకుండా లోతుగా గాడి తీసినట్లు గుర్తించారు. ఒక్కొక్కరుగా తమ ఎడ్లబండ్లను గాడిని తప్పించి బయటకు తీసుకువస్తున్న క్రమంలో మస్తాన్ ఎడ్లబండి గాడిలో ఇరుక్కుని ఒరిగింది. ఎద్దులు పట్టుతప్పడంతో మస్తాన్ అదే గుంతలో పడి ఊపిరాడక ప్రాణాలు కోల్పోయాడు. తోటి బండ్ల వారు గుర్తించేలోపే మస్తాన్ మృతి చెందాడు. అరుంధతీ కాలనీ వాసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎడ్లబండ్లు వెళ్లకుండా గాడి తీసిన గూడలికి చెందిన కేశవరెడ్డితో వాగ్వాదానికి దిగారు. అతని ఇంటి ముందు మస్తాన్ మృతదేహంతో ఆందోళన చేపట్టారు. మృతుని కుటుంబానికి న్యాయం చేసే వరకు కదిలేది లేదని భీష్మించుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ పుల్లారావు అక్కడికి చేరకుని సర్దుబాటు చేయడంతో మృతదేహాన్ని అక్కడి నుంచి తరలించారు.

కలచివేసిన ఆడపిల్లల రోదన

మృతుడు మస్తాన్‌కు భార్య బుజ్జమ్మ, నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. పెద్ద కుమార్తె మన్విత ఇంటర్ చదువుతుండగా.. మిగతా ముగ్గురూ రమ్య–10, రుతిక–8, అవంతి–5వ తరగతి చదువుతోంది. అనుకోని ప్రమాదంలో పెద్ద దిక్కును కోల్పోవడంతో మృతదేహంపై పడి వారు రోదిస్తున్న తీరు అందరినీ కలచి వేసింది. ఇంక మాకు దిక్కెవరంటూ ఆడపిల్లలు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఫుట్‌బాల్ విజేత శ్రీకృష్ణచైతన్య డిగ్రీ కళాశాల



హ్యాండ్‌బాల్ విజేతకు ట్రోఫీని అందజేస్తున్న ప్రిన్సిపాల్

గూడూరు రూరల్: పట్టణంలోని ఎన్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన విక్రమ సింహపురి యూనివర్సిటీ అంతర్ కళాశాలల క్రీడాపోటీలు గురువారం ముగిశాయి. ఫుట్‌బాల్ విజేతగా శ్రీక్రిష్ణచైతన్య డిగ్రీ కళాశాల నెల్లూరు, రన్నర్‌గా కావలి జవహర్‌భారతి డిగ్రీ కళాశాల జట్లు నిలిచాయి. అదేవిధంగా టేబుల్‌టెన్నిస్ విభాగంలో విన్నర్‌గా కావలి జవహర్‌భారతి, రన్నర్స్‌గా కావలి పీజీ కళాశాల నిలిచాయి. డబుల్స్‌లో విన్నర్‌గా కావలి జవహర్ భారతి డిగ్రీ కళాశాల, రన్నర్స్‌గా కావలి పీజీ కళాశాల నిలిచాయి. హ్యాండ్‌బాల్ పోటీల్లో విన్నర్స్‌గా కావలి జవహర్‌భారతి డిగ్రీ కళాశాల, రన్నర్స్ విక్రమ సింహపురి యూనివర్శిటీ నెల్లూరు గెలిచాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నారాయణరాజు, పీడీలు మాల్యాద్రి, ప్రసాద్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

అమెరికా అబ్బాయి.. ఆంధ్ర అమ్మాయి..



తిరుపతిలోని వివాహ రిసెప్షన్ వేదికపై తల్లిదండ్రులతో అమ్మాయి, అమెరికా అబ్బాయి

తిరుపతి కల్చరల్: అమెరికాకు చెందిన అబ్బాయి, ఇండియాలోని తిరుపతికి చెందిన అమ్మాయికి తిరుపతి నగరంలో గురువారం రాత్రి అత్యంత వేడుకగా వివాహ రిసెప్షన్ జరిగింది. పీలేరుకు చెందిన పి.విద్యాసాగర్‌రెడ్డి అమెరికాలో స్థిరపడ్డారు. తర్వాత తిరుపతికి చెందిన పి.విజయలక్ష్మిని ఆయన వివాహం చేసుకున్నారు. ఈ దంపతుల కుమార్తె రోషిణి వైష్ణవి అమెరికాలోనే చదువుకుంది. ఈనేపథ్యంలో మ్యూజిక్ బ్రాండ్ కాస్ట్ మూవీ మేకర్‌గా అమెరికాకు చెందిన కోడి జేమ్స్‌లాయిడ్ పనిచేస్తున్నారు. రోషిణి వైష్ణవికి, కోడి జేమ్స్ లాయిడ్‌కు సంగీతమంటే ఇష్టం. అమెరికాలోని అట్లాంట్ మ్యూజిక్ ట్రెనింగ్ సెంటర్‌లో వీరిద్దరి మనసులు కలిశాయి. వీరి ఇష్టాన్ని గుర్తించిన విద్యాసాగర్ దంపతులు పిల్లల ఇష్టాలకు విలువనిస్తూ అమెరికా అబ్బాయి తల్లిదండ్రులను ఒప్పించారు. ఈ క్రమంలో తెలుగు సంప్రదాయం ప్రకారం వివాహం జరిపేందుకు ఇరువురి కుటుంబాలు అంగీకరించాయి. ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలోని డీబీఆర్ రోడ్డులోనున్న శ్రీ కన్వెన్షన్ హాల్లో గురువారం రాత్రి వధువు, వరుడు ఇరువురి బంధువుల సమక్షంలో వేడుకగా వివాహ రిసెప్షన్ నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున వివాహం జరగనుంది. అమెరికా సంప్రదాయం ప్రకారం రానున్న ఫిబ్రవరిలో వివాహం జరిపించనున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు.

చదువును నిర్లక్ష్యం చేస్తే జీవితం అంధకారమే



మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి సిటీ : విద్యార్థులు చదువును నిర్లక్ష్యం చేస్తే జీవితం అంధకారమవుతుందని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి హెచ్చరించారు. ఎస్వీ ఆర్ట్ కళాశాలలో గురువారం 79వ విద్యార్థి సంఘం ప్రారంభోత్సవం నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. డిగ్రీ పూర్తయిన తర్వాత మరో మూడేళ్లు బాగా చదివితే అత్యున్నత స్థానాలకు చేరుకోవచ్చని సూచించారు. తాను 1977లో ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో చదివి, విద్యార్థి నాయకుడిగా ఎదిగినట్లు చెప్పారు. తాను మొదటిసారి టీటీడీ చైర్మన్‌గా పనిచేసే సమయంలో విద్యార్థులకు ఉచితంగా భోజనం అందించాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. జేఈవో సదాభార్గవి, డీఈవో భాస్కర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ నారాయణమ్మ, విశ్రాంత ప్రిన్సిపాల్ క్రిస్టోఫర్ పాల్గొన్నారు.

సంక్షేమం.. సురక్షితం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా అడుగులు వేస్తోంది. పేదల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తోంది. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తోంది. ఇక అంతదూరం రాలేక సమస్యలతో సతమతమవుతున్న గ్రామీణుల కోసం స్థానికంగానే జగనన్న సురక్ష పేరుతో క్యాంపులు నిర్వహించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించింది. ఈనేపథ్యంలో అర్హతే ప్రామాణికంగా పాలన సాగిస్తున్న సీఎం జగనన్నకు పలువురు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

– తిరుపతి అర్బన్



జగనన్న సురక్ష క్యాంపుల్లో అధికారులు

ఉచితంగా ఇచ్చారు



గతంలో ఎన్నడూ ఇలాంటి పథకాన్ని చూడలేదు. పైసా ఖర్చు లేకుండా ఉచితంగా ఇంటి వద్దకే వచ్చి సర్టిఫికెట్లు ఇచ్చారు. చదువు లేకపోవడంతో ఆఫీసులకు వెళ్లి ధ్రువపత్రాలు పొందాలంటే ఇబ్బందిగా ఉండేది. ఆధార్ కార్డుకు ఫోన్ నంబర్ లింక్ కాకపోవడంతో వివిధ పథకాలు నిలిచిపోయాయి. వలంటీరే ఇంటి వద్దకు వచ్చి అన్ని వివరాలు తీసుకుని, దరఖాస్తు చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో నిర్వహించిన ప్రత్యేక క్యాంపులో ఆధార్ కార్డుకు ఫోన్ నంబర్ లింక్ చేశారు. అలాగే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు కూడా ఉచితంగా తెచ్చి ఇచారు.

– పిల్లి రమణయ్య, సైదాపురం మండలం, చాగణం గ్రామం

రెండు రోజుల్లోనే సర్టిఫికెట్లు వచ్చాయి



మా సచివాలయ పరిధిలో జూలై 3వ తేదీ నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో నేను కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నా. ఎప్పుడూ లేని విధంగా రెండు రోజుల్లో నాకు ధ్రువీకరణ పత్రాలు వచ్చాయి. అధికారులే ఇంటికొచ్చి సర్టిఫికెట్లు ఇచ్చారు. వీటితో వైఎస్సార్ చేయూత పథకానికి దరఖాస్తు చేసుకున్నా. ఆ పథకం లబ్ధి కోసం జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడింది.

– ధనలక్ష్మి, ఎం.కొంగరవారిపల్లి, ముంగిళిపట్టు పంచాయతీ, చంద్రగిరి మండలం

20 ఏళ్ల తర్వాత ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్



నా తండ్రి నారయ్య 20 ఏళ్ల క్రితం చనిపోయాడు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం ఏళ్లుగా దరఖాస్తు చేస్తూ వస్తున్నా. అయినా ఒక్కరూ పట్టించుకోలేదు. నా తండ్రి ద్వారా సంక్రమించిన భూమిని పంపకాలు చేసుకోలేక ఎలాంటి రుణాలు పొందలేక ఇబ్బందులు పడ్డాం. గత జూలైలో జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే అధికారులు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ మంజూరు చేశారు. ఈ పథకం కుటుంబానికి ఎంతో ఊరటనిచ్చింది. సీఎం జగనన్నకు కృతజ్ఞతలు.

– నాగార్జున, వెంకటాచలం

నిమిషాల్లో రేషన్‌కార్డు బదిలీ



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సమస్యలు అప్పటికప్పుడే పరిష్కారమవుతున్నాయి. ఊళ్లోనే ఇబ్బంది లేకుండా రేషన్ కార్డును బదిలీ చేశారు. గతంలో రేషన్‌కార్డు బదిలీ చేసుకోవాలంటే ఇబ్బందులు పడేవాళ్లు. జగన్న సురక్ష పథకంలో వలంటీరు ఇంటి వద్దకు వచ్చి అన్ని వివరాలు తీసుకున్నారు. ఆపై దరఖాస్తు చేయించి రేషన్‌కార్డు బదిలీ చేయించారు. ఎంతో సంతోషంగా ఉంది.

– కే.కృష్ణమ్మ, శివయ్య దంపతులు

ఆరోగ్యశ్రీ కార్డు వచ్చింది



గత టీడీపీ పాలనలో ఆరోగ్యశ్రీకార్డు కోసం ఎంతో ప్రయత్నించాం. కానీ ఫలితం లేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక జగనన్న సురక్ష కార్యక్రమంలో వలంటీరే ఇంటికొచ్చి సమస్యను తెలుసుకుని దరఖాస్తు చేశారు. ఆపై రెండు రోజులకే ఆరోగ్యశ్రీ కార్డు తెచ్చి ఇచ్చారు. ఎంతో సంతోషంగా ఉంది. ఆరోగ్య సమస్యలు వస్తే ఇక దిగులుండదు.

– నన్నారు బుజ్జమ్మ, మానమాల, ఓజిలి మండలం